క్లుప్తంగా

కూచిపూడిలో యశశ్రీ ప్రతిభ


నృత్య ప్రదర్శన ఇస్తున్న యశశ్రీ

ధవళేశ్వరం: ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం తిరుమల తిరుపతిలోని మహతి కళా క్షేత్రంలో అభినయ ఆర్ట్స్ రజతోత్సవ వేడుకల్లో జరిగిన పోటీల్లో ధవళేశ్వరం గ్రామానికి చెందిన కూచిపూడి నృత్యకారిణి నురుకుర్తి యశశ్రీ విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నెల 19 నుంచి 27 వరకు జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో యశశ్రీ సోలో విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా హనుమ అవార్డును యశశ్రీ కైవసం చేసుకున్నారు. వివిధ కూచిపూడి నృత్య పోటీల్లో విశేష ప్రతిభ చూపుతూ, ధవళేశ్వరం గ్రామ ఖ్యాతిని నలుమూలల చాటుతున్న కూచిపూడి నృత్యకారిణి నురుకుర్తి యశశ్రీకి పలువురు నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

ప్రకాశం నగర్: ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని స్కూలు, కళాశాల స్థాయి విద్యార్థినుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో ఒకటి నుండి ఐదో తరగతి విద్యార్థులు సుమారు 93 మంది పాల్గొన్నారు. అన్నమాచార్య, రామదాసు సంకీర్తనలకు అనుగుణంగా విద్యార్థినులు నృత్యం చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రకాశం నగర్: ధర్మస్థలి ఘటనలో ఉన్నత విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య డిమాండ్ చేశారు. మంళవారం ధర్మస్థలి సంఘటనకు వ్యతిరేకంగా స్థానిక ఎస్‌కేఆర్ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ, 1998 నుంచి 2014 వరకు పలువురు మహిళలు, చిన్నారుల శవాలను పూడ్చిపెట్టినట్టు మాజీ పారిశుద్ధ్య కార్మికుడు వాగ్మూలం ఇవ్వడం సభ్య సమాజం భయంతో నివ్వెరపోయేలా చేసిందన్నారు. కర్నాటక ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘోరం జరిగిందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ మాట్లాడుతూ, గతంలో సౌజన్య మిస్సింగ్ విషయంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి ఉంటే అక్కడ అన్ని అనర్థాలు జరిగి ఉండేవి కావని అభిప్రాయపడ్డారు.

ఆస్పత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

కంబాలచెరువు: వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు నగరంలోని దానవాయిపేటలోని ఏఆర్‌టీ, సరోగసీ సేవలందిస్తున్న రెండు ఆస్పత్రులను మంగళవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఏఆర్‌టీ కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా సేవలు అందుతున్నాయా, లేదా అనే విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మౌలిక సదుపాయాలు, అర్హత కలిగిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా, పేషెంట్ ఒప్పంద పత్రాలు, సరోగసీకి సంబంధించిన న్యాయపరమైన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన సర్టిఫికెట్లు పూర్తి స్థాయిలో ఉన్నాయా వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డాక్యుమెంటేషన్‌ను సక్రమంగా నమోదు చేసి, అవసరమైన సూచనలు ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజీవ్, డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

కంబాలచెరువు: విలువల విద్య పుస్తకాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు అందించినట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి మంగళవారం పుస్తకాలను హెచ్‌ఎంలకు అందజేశారు. రాష్ట్ర విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి ఈ పాఠ్య పుస్తకాలను రూపొందించిందన్నారు. ఆరో తరగతికి తోరణాలు, ఏడో తరగతికి మనోవికాసం, ఎనిమిది, తొమ్మిది తరగతులకు సూక్తి సుధ, పదో తరగతికి అమృత ధార పేరుతో ఈ పుస్తకాలను రూపొందించారన్నారు. ఆయా పాఠ్యాంశాల వీడియోలు కావాలనుకునేవారు పుస్తకాల్లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్‌ఎంటీలు జయంతిశాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి చీరల సమర్పణ

సీటీఆర్ఐ: శ్రావణ మాసం సందర్భంగా గాడాల గ్రామంలోని మహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాన్ని టీటీడీ సూపరింటెండెంట్ దేవపత్ని భాస్కర్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి రూ.75 వేల విలువైన 64 నేత చీరలను కానుకగా సమర్పించారు. పీఠాధిపతి గురుగోవింద, రాజగురు డాక్టర్ చిన్నవేంకన్నబాబు స్వామీజీ, మాతాజీ దుర్గావెంకట హేమావతి వీటిని స్వీకరించారు.

నరకానికి అప్రోచ్

- మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద అడుగడుగునా గోతులే..
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అన్నీ తామే చేసేశామంటూ భుజాలెగరేస్తున్న ప్రజాప్రతినిధులు


ఫ్లైఓవర్ వద్ద మోరంపూడి జంక్షన్ నుంచి హుకుంపేట వరకు అప్రోచ్ రోడ్డులో గోతులు


లాలాచెరువు-మోరంపూడి జంక్షన్ అప్రోచ్ దుస్థితి


గోతులమయంగా మోరంపూడి జంక్షన్ నుంచి లాలాచెరువు అప్రోచ్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లైఓవర్‌కు ఉన్న అప్రోచ్ రోడ్డులో అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. వీటిపై ప్రయాణించే వాహనచోదకులకు నరకం కనిపిస్తోంది. ప్రయాణికుల కష్టాలు తీర్చడంలో ప్రభుత్వ యంత్రాంగం కనీస శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మోరంపూడి ఫ్లైఓవర్‌కు అప్రోచ్ రోడ్లు నిర్మించకుండానే ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవం చేసేశారు. అప్పటి నుంచి ఏడాదిగా ఫ్లైఓవర్‌కు అప్రోచ్ నిర్మాణం జరగలేదు. ఆ రోడ్డులో ఉన్న గోతుల్లోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అప్రోచ్ రోడ్డులో గోతులపై కూటమి ప్రజాప్రతినిధులకు కనువిప్పు కలిగించేందుకు మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆ గోతులను నల్లచప్రుతో పూడ్పించారు. దీంతో స్పందించిన నేషనల్ హైవే అధికారులు ఇటీవల ఆ గోతులకు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారు.

వర్షాల రాకతో..

అప్రోచ్ రోడ్డులో వేసిన ప్యాచ్‌వర్కులు ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమై.. మరలా గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే వాహనచోదకులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మోరంపూడి ఫ్లైఓవర్‌పై లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో, రాత్రి సమయాల్లో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు, మోటార్ బైక్‌లు గోతుల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో పాటు పలువురు వాహనచోదకులు అదుపుతప్పి కిందపడడంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా.. అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సిన కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు మాత్రం తొలి అడుగు పేరుతో అభివృద్ధి చేసేశామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. ఓ ప్రజాప్రతినిధి అయితే మోరంపూడి ఫ్లైఓవర్‌పై అనధికారికంగా హోర్డింగ్‌లు వేసి, తొలి అడుగు డోర్ టు డోర్ అంటూ పెద్ద ఫొటోలతో ప్రచారం చేసుకోవడాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. అప్రోచ్ రోడ్లపై గోతులు పూడ్చించలేని ఆ ప్రజాప్రతినిధి.. ప్రచారం మాత్రం ఆర్భాటంగా చేసుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అప్రోచ్ రోడ్లను పూర్తి స్థాయిలో, పటిష్టంగా నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం నరకమే..



మోరంపూడి ఫ్లైఓవర్‌ను మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ వేగంగా నిర్మాణం పూర్తి చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం అప్రోచ్ రోడ్లు వేయించలేని పరిస్థితి. అప్రోచ్ రోడ్డులోని గోతుల్లో ప్రయాణం నరకంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అప్రోచ్ రోడ్లలోని గోతులు పూడ్చించాలి. పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మించి, ఫ్లైఓవర్‌పై లైట్లు ఏర్పాటు చేయాలి.

– పడాల వీరరాఘవరెడ్డి, మోరంపూడి

ఇంటి చెత్త నిర్వహణ ప్రజల బాధ్యత


స్థానికులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: తడి, పొడి చెత్తను వేరు చేసి అందించడం ప్రజలు బాధ్యతగా భావించాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం లాలాచెరువు వాంబే కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు వస్తున్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నట్టు చెప్పారు. వీధులను పరిశుభ్రంగా ఉంచి, స్థానికులు ఇబ్బందులకు గురి కాకుండా డ్రైన్లలో పూడికలు తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. దెబ్బతిన్న డ్రైనేజీ పైపులైన్లకు మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. ఆయన వెంట పబ్లిక్‌హెల్త్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సర్పంచ్ ఎన్నిక ఏర్పాట్ల పరిశీలన


కడియపులంకలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీపీవో శాంతామణి

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి మంగళవారం పరిశీలించారు. ఆగస్టు పదో తేదీన సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం విదితమే. సర్పంచ్‌గా ఎన్నికైన మార్గాని అమ్మాణీ మృతి చెందడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. కాగా గ్రామంలోని పోలింగ్ బూత్‌లను డీపీవో తనిఖీ చేశారు. మొత్తం 15,165 మంది ఓటర్లకు గాను 36 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు డీపీవోకు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలపై సిబ్బందికి ఆదేశాలిచ్చారు. అనంతరం ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం అరికట్టాలన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులతో సమీక్ష చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో నల్లం శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయితో నలుగురి అరెస్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి మున్సిపల్ కాలనీలోనిని డంపింగ్ యార్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని మంగళవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అడ్డతీగల నుంచి గంజాయి తీసుకొచ్చిన ఓ యువకుడి వద్ద రాజమండ్రికి చెందిన ముగ్గురు కొనుగోలు చేస్తుండగా, తమ సిబ్బందితో దాడి చేసినట్టు ఇన్‌స్పెక్టర్ అప్పారావు తెలిపారు. సరకును స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేద్దాం

పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హసన్ షరీఫ్


హసన్ షరీఫ్‌కు స్వాగతం పలుకుతున్న హబీబుల్లాఖాన్

రాజమహేంద్రవరం సిటీ: భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ ఘన విజయాలు సాధించేలా పార్టీ శ్రేణులంతా ఐక్యతతో కృషి చేయాలని, జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హసన్ షరీఫ్ పిలుపునిచ్చారు. మంగళవారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయనకు పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబుల్లాఖాన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హసన్ షరీఫ్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పాటుపడాలన్నారు. మైనార్టీల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. మైనార్టీల సంక్షేమాభివృద్ధి తమవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పార్టీ ఆర్‌టీఐ విభాగం ప్రెసిడెంట్ ఎండీ అమీర్ పాషా మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతను ప్రోత్సహించడంలో అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ ముందుంటారన్నారు. మైనార్టీల సంక్షేమంపై రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ తరఫున చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ షబ్బీర్, ఎండీ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకుండా ఆర్చి నిర్మాణం!


కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్యనగర్, కోస్టల్ పేపర్ మిల్లుకు వెళ్లే దారిలో రైల్వే గేటును ఆనుకుని చేస్తున్న ఆర్చి నిర్మాణ పనుల్లో ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని జేగురుపాడు ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్‌కుమార్, ప్రతినిధులు మద్దుకూరి సూరిబాబు, మోటిక మునియ్య, బళ్ల అన్నవరం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ నిర్మాణ పనులకు ఎవరు అనుమతులిచ్చారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. పంచాయతీ నిధులా? లేక సర్పంచ్ సొంత నిధులా? అనేది కూడా తెలియడం లేదన్నారు. ఒకవేళ పంచాయతీ నిధులైతే ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. అక్కడ ఏ ఒక్క ఇంజినీరింగ్ సిబ్బంది కనిపించడం లేదని చెప్పారు. రైల్వే గేటుకు అతి సమీపంలో నిర్మిస్తున్న ఈ నిర్మాణం నాణ్యత లోపాల కారణంగా ఒకసారి పాక్షికంగా కూలిపోయిందన్నారు. వెనుకనే ఉన్న రైల్వే హైటెన్షన్ వైర్లపై పడితే భారీ ప్రమాదం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్మాణాల కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజిలెన్స్ ఉన్నతాధికారులకు కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి విద్యార్థి సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండేందుకు వాటిపై అవగాహన కలిగి ఉండాలని బొమ్మూరు పోలీసుస్టేషన్ ఎస్సై సీహెచ్‌వీ రమేష్ అన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు మంగళవారం హుకుంపేటలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మూర్తి అధ్యక్షతన సైబర్ నేరాలు, మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వినియోగంలో తగిన జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, టెలిగ్రాం, స్నాప్‌చాట్, స్కైప్‌లో అపరిచితులతో చాటింగ్ చేయవద్దని సూచించారు. అనవసర లింకులను, అప్లికేషన్లను క్లిక్ చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై అమీనాబేగం మాట్లాడుతూ, మహిళలు, బాలికల రక్షణ కోసం ఉద్దేశించిన చట్టాల ద్వారా కల్పిస్తున్న హక్కులు, స్వీయ రక్షణను విద్యార్థులకు విశదీకరించారు. రక్షణ కోసం మహిళలు, బాలికలు 112 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. జిల్లా సైబర్ సెల్ పోలీసులు వైఎస్ సురేష్, మహేష్ మాట్లాడుతూ, ఫేక్ లోన్ అప్ ఫ్రాడ్, టాస్క్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరస్తులకు చేరకుండా ఎలా భద్రపరుచుకోవాలో మెళకువలు వివరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఏఎస్సై రాంబాబు నాయక్, ఉపాధ్యాయుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు కృషి చేయాలి


పెదపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీఓ

పెదపూడి: మండల, గ్రామ స్థాయి కమిటీలు బాలల సంరక్షణకు కృషి చేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ సీవీవీ సత్యనారాయణ, డీసీహెచ్ఎల్ ఆఫీసర్ కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, మిషన్ వాత్సల్య పథకంలో 18 ఏళ్ల లోపు బాలబాలికల సంరక్షణ, వారి చట్టాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలన్నారు. బాల్య వివాహాల చట్టాలు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు శ్రీపద్మ, అరుణశ్రీ, జానకి, హెచ్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

కోరుకొండ: మానవ అక్రమ రవాణాను నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని క్రాఫ్ కమ్యూనిటీ సోషల్‌వర్కర్ లిల్లీ క్వీన్ అన్నారు. మంగళవారం కోరుకొండ బస్టాండ్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాధవరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా రైతులు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. స్థానిక మహాకాళేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న అరుణా ప్యాలెస్‌లో ప్రకృతి వ్యవసాయంపై రాజమహేంద్రవరం సబ్ డివిజన్ పరిధిలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా శిబిరం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, ఇందులో భాగంగా రూపొందించిన 9 సహజ వ్యవసాయ సూత్రాలను రైతులకు వివరించాలన్నారు. ఏటీఎం పెరటి తోటలు, ఏ–గ్రేడ్ మోడల్‌లో వివిధ పంటల సాగుపై మెళకువలు విశదీకరించారు.

జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించే దిశగా రైతులను చైతన్యపరచి, ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ, పలు పంటల్లో శాస్త్రవేత్తల పరిశోధనల సిఫార్సుకు అనుగుణంగా సమగ్రమైన సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, వరి సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయ పథక సంచాలకుడు తాతారావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామ లక్ష్మి, రాజమహేంద్రవరం వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికార్లు భీమరాజు, సూర్యరమేష్, కళ్యాణ్, అర్బన్ ఏఈవో వేణుమాధవరావు, కార్యక్రమ కన్వీనర్లు వల్లి, గౌతమ్, సబ్ డివిజన్ వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

విద్యా ప్రవేశ్ సమర్థంగా నిర్వహించాలి

పాఠశాల విద్య ఆర్జేడీ నాగమణి


నారాయణపురం పాఠశాలను తనిఖీ చేస్తున్న ఆర్జేడీ నాగమణి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుదలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్య శాఖ జోన్–2 ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు నాగమణి అన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని నారాయణపురం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులు రాసిన వర్క్ బుక్‌లను పరిశీలించారు. చిన్నారుల పాటలు, పద్యాలు, ఆటలు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయిలో ఆసక్తికర తరగతి గది ఉంటే విద్యార్థులు బాగా చదువుకుంటారన్నారు. ఆమె వెంట అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, హెచ్‌ఎం డి.జయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్కూళ్ల అభివృద్ధికి హెచ్‌ఎంలే కీలకం

డీఈఓ వాసుదేవరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు కెప్టెన్ లాంటి వారని, పాఠశాల ప్రగతిలో ఆయన పాత్ర కీలకమైందని డీఈఓ కంది వాసుదేవరావు అన్నారు. హుకుంపేటలోని ఎస్ఆర్ రెసిడెన్షియల్ పాఠశాలలో లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నాలుగు రోజుల శిక్షణలో రెండో రోజైన మంగళవారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న హెచ్‌ఎంలు, రిసోర్స్ పర్సన్లతో శిక్షణ తీరు, వసతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ, హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని పాఠశాల సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగేలా, వారి అభ్యసన సామర్థ్యాలు పెంపొందేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల గైర్హాజరు తగ్గించాలని, పాఠశాల నిర్వహణ, అభ్యసన ప్రమాణాలు పెంపొందించడానికి నాయకత్వం వహించాలని నిర్దేశించారు. ప్రతి ఒక విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి, గ్యారంటీ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డి.గౌరీశంకరరావు, జిల్లా ఐఈ కో–ఆర్డినేటర్ కనకబాబు, రంగంపేట ఎంఈఓ మధుసూదనరావు పాల్గొన్నారు.

మనసు, శరీరాన్ని ఏకీకృతం చేసేది యోగా

కంబాలచెరువు: శరీరాన్ని, మనస్సును ఏకీకృతం చేయగలిగిన ఏకైక సాధనం యోగా అని కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రం తెలుగు ప్రాంత ఇన్‌చార్జి గండికోట శ్రీనివాస్ అన్నారు. వివేకానంద కేంద్రం సౌజన్యంతో స్థానిక ఆర్ట్స్ కళాశాల ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యోగా విమర్శనాత్మక పరిశీలన జీవన విధానం అనే అంశంపై మంగళవారం విద్యార్థులకు ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ముఖ్య వక్తగా శ్రీనివాస్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

యోగా శారీరక స్థిరత్వం ద్వారా మానసిక స్థిరత్వం అందిస్తుందని, తద్వారా లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. బాహ్య, అంతర్గత సౌందర్యాన్ని పెంపొందించుకుని, నెగెటివ్ నుంచి పాజిటివ్ ఆలోచనలకు సాధనంగా యోగా ఉపయోగపడుతుందన్నారు. కొండలు అడ్డు వచ్చినప్పటికీ నీటి ప్రవాహం తన దిశను మార్చుకుని ఏ విధంగా గమ్యం చేరుతుందో, అదే విధంగా యోగా సాధన ద్వారా ఎన్ని ఆటంకాలు వచ్చినా గమ్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఫిలాసఫీ విభాగాధిపతి డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులకు యోగా అనేది లక్ష్య సాధనలో గమ్యం వైపు దారి చూపే గురువు లాంటిదన్నారు. యోగా నిత్య సాధన ద్వారా సాధారణ విద్యార్థి సైతం ఉన్నత సామర్థ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్క్ లెక్చరర్ డాక్టర్ శివకోటిరాణి, సయ్యద్ ఫరా, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు సరోజ, ఫిలాసఫీ లెక్చరర్లు ముప్పిడి మహేష్, సత్యం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ఉపాధ్యాయుల ఆందోళన


మల్లంపూడిలో శిక్షణా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం: శిక్షణ కేంద్రంలో సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా బాధిస్తున్నారు. కనీసం తాగేందుకు మంచినీరు కూడా దొరకడం లేదు, అరకొరగానే నీరు సరఫరా అవుతోంది. రాత్రివేళల్లో తరచూ కరెంటు పోతుంది. మారుమూల ప్రాంతం కావడంతో దోమల బాధ ఎక్కువే. సరైన సదుపాయాలు లేకుండా ఇచ్చే శిక్షణతో తమను బాధించడం మినహా ప్రయోజనం ఏముంటుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గత ఏడెనిమిది ఏళ్లుగా ఈ ఇంజినీరింగ్ కళాశాల మూతపడి ఉండటంతో తలుపులు పాడై, గొళ్లాలు ఊడిపోయి, బాత్‌రూమ్‌ల డోర్లు సరిగా లేవన్నారు. ఈ విధంగా ఉన్న భవనాల్లో చంటిపిల్లలతో వచ్చిన తల్లులు పడుతున్న బాధలు మరింత అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనా సామర్థ్యం పెంపులో భాగంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ బోధనపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు చెందిన 154 మంది ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు ఇచ్చే శిక్షణా తరగతులు మండలంలోని మల్లంపూడిలో ఉన్న సాయిమాధవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. రెండో రోజుకే అక్కడ కల్పించిన సదుపాయాలతో ఇమడలేక మంగళవారం రాత్రి ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఈ విషయమై కాకినాడ జిల్లా జీసీడీఓ ఉమామహేశ్వరిని వివరణ కోరగా, మౌలిక సదుపాయాల కొరత లేదన్నారు. గ్రామీణ ప్రాంతం కావడంతో మల్లంపూడిలో తరచూ కరెంటు పోతుందని, వాటర్ ట్యాంక్ ఫుల్ కాకపోవడంతో కొంతమేరకు నీటి సమస్య వస్తున్న మాట వాస్తవమేనన్నారు. ఇంతకు మించి సమస్యలు లేవన్నారు.